


టేకుమళ్ల వెంకటేశ్వరరావు

# మా మాస్టారు

“శ్రీవారికి ఇంటికి రావడానికి ఇంకా ఎంతసేపవుతుంది?” మొబైల్లో అడిగింది శ్రీమతి.

“బయలుదేరడానికింకో అరగంట పట్టొచ్చు.. ఏవిటి విశేషాలు...?”

“మాస్టారు మీ కోసం ఎదురుచూస్తున్నారు”

ఒక్క క్షణం నాకేమీ పాలుపోలేదు. నన్ను నేను సంభాళించుకుని అడిగాను....

“ఎప్పుడొచ్చారు” మాట తడబడింది. ‘ఉన్నట్టుండి ఎందుకొచ్చారో పాపం’ మనసులోనే అనుకున్నాను.

“ఇప్పుడే... ఓ పావుగంటయ్యింది. మనల్ని చూసి చాలా రోజులయ్యిందని వచ్చారంట”

“సరే, ఈలోగా ఆయనకి స్నానాదులు చూడు. అన్నట్టు ఆయనకి పకోడీలంటే చాలా ఇష్టం చేసిపెట్టు”

“అలానే”

బండి నడుపుతున్నానన్న మాటే కానీ మనసు మనసులో లేదు. ఎప్పుడెప్పుడింటికి చేరతానా అన్నట్టుంది. సమయం గడుస్తున్నట్టు లేదు. బహుశా ఐన్‌స్టీన్ సిద్ధాంతం పనిచేస్తున్నట్టుంది. అయినవారి విషయంలో నిమిషాలు గంటల్లా దొర్లుతాయన్నమాట.

మాస్టారి అసలు పేరు కామేశ్వరరావు.. కానీ ఆయన మాస్టారుగానే అందరికీ తెలుసు. కొంత మందికి మాత్రం ఆయన కామేశం మాస్టారు. మాస్టారు జిల్లా ఉన్నత పాఠశాల అధ్యాపకునిగా చేరి, కళాశాల ప్రిన్సిపాలుగా నివృత్తి పొందారు. నివృత్తి పొంది కూడా పదిహేనేళ్లయింది. మా ఇద్దరిదీ ఒకే జిల్లాయే. దాదాపు ఆరుమైళ్ల దూరంలో ఇద్దరి ఊళ్లూ ఉన్నాయి. మా తల్లిదండ్రులకు ఆయన ముందు నుంచే తెలిసినా, కాకినాడలో మా బాబాయి దగ్గరుండి చదువుకోవడం వల్ల నా చిన్నతనంలో నేనాయన్ని చూడలేదు. ఆయనతో నా తొలి పరిచయం నా పెళ్లిలో జరిగింది. ఆ శుభఘడియల్లో జరిగిన కలయిక మూడున్నర దశాబ్దాలుగా కొనసాగుతోంది. అసలు నా పెళ్లి సంబంధం తెచ్చింది కూడా ఆయనే.

నా పెళ్లయిన ఏడాదికి మాస్టారు పనిచేస్తున్న కాలేజీలోనే నేనూ లెక్చరర్‌గా చేరాను. అప్పటికి కాలేజీ ప్రారంభించి రెండేళ్లయింది. నేను చేరిన కొత్తలోనే ఆయన కాలేజీ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి గురించి తెలిసింది. విద్యార్థుల కోసం ఆయన పడే శ్రమ. వారిని క్రమశిక్షణలో పెట్టే విధానం. తోటి ఉద్యోగస్తులకి ఆయనిచ్చే గౌరవం, ప్రోత్సాహం, చూపే వాత్సల్యం మరువలేనివి. ఆదివారాలూ, సెలవురోజులూ, పండగలూ అని కాకుండా వీలైనప్పుడల్లా ప్రత్యేక తరగతులు తీసుకునేవారు. ఆయన ప్రోద్బలం వల్ల నేనూ ప్రత్యేక తరగతులు తీసుకునేవాణ్ని. కానీ నాకు సెలవురోజుల్లో తొందరగా లేవాలంటే విసుగనిపించేది. ఇప్పటికీ ఆ అలవాటు పూర్తిగా పోలేదు. చాలాసార్లు ఆలస్యంగా వెళ్లేవాణ్ని. అలా వెళ్లేటప్పుడు అడ్డదారిన వెళ్లేవాణ్ని. ఆ దారి సరిగ్గా మాస్టారి ఇంటి ముందు నుంచి వెళ్లేది. మాస్టారి ఇల్లు ఎత్తులో ఉంటే కాలేజీ పల్లంలో ఆయనింటికి ఒక మైలు దూరంలో ఉండేది. దారి కూడా ఇరుకైనది. అప్పట్లో జరిగిన ఒక సంఘటన ఇప్పటికీ నా మనసులో తాజాగా ఉంది. మాస్టారి మంచితనాన్ని నాకు చవిచూపించిందీ. నా ప్రవర్తనలో గమనించతగ్గ మార్పుని తెచ్చిందీ ఆ సంఘటనే. అంతేకాదు తరువాత కాలంలో వృత్తిలో నేనందుకున్న పురస్కారాలకి, లభించిన తృప్తికి అదే కారణం.

ఆరోజు కూడా ఏదో సెలవు రోజు. ఆలస్యంగా లేచిన నేను మరింత ఆలస్యం కాకూడదని అడ్డదారి వెంట కాలేజీకి స్కూటర్‌పై రాకెట్ వేగంతో చేరుకున్నాను. టైం చూసుకున్నాను పదీ ఇరవై. అంటే అప్పటికి ఇరవై నిమిషాలు ఆలస్యం. బంట్రోతు రంగడి ద్వారా మస్టారింకా రాలేదని, రెండు గంటలకి క్లాసు తీసుకుంటారని తెలుసుకుని మనసులో హమ్మయ్య అనుకుని తిన్నగా క్లాసురూంకి వెళ్లాను. నిజం చెప్పొద్దూ ఎంతగా మా కుటుంబంతో ఆయనకి అనుబంధం ఉన్నా క్రమశిక్షణంటే ప్రాణమిచ్చే ఆయనంటే నాకెప్పుడూ మనసులో భక్తి, భయమూను. పాఠం ముగించి రెండు గంటల తరువాత బయటికి వచ్చిన నాకు రంగడి ద్వారా మాస్టారు నా కోసం తన గదిలో ఎదురుచూస్తున్నారని తెలిసి ఆయన్ను చూడడానికి వెళ్లాను.

“నమస్తే” అన్నాను.

“కూర్చో” అన్నారు మాస్టారు.

ముఖకవళికలు చూద్దామంటే అడ్డంగా పేపరు పెట్టుకుని చదువుతున్నారు.

దాదాపు పదిహేను నిమిషాలు గడిచాయి. ఆయనలో ఎటువంటి కదలికలూ లేవు. కుర్చీలో అసహనంగా కదిలాను.

“ఎంతమంది పిల్లలొచ్చారు” పేపరు పక్కన పెట్టి అడిగారు.

“ఇరవై ఐదు మంది” చెప్పాను.

“ఎన్నింటికి”

“పదింటికే కానీ పదిన్నరకి తీసుకున్నాను.”

“అంటే ఈ రోజు ఆలస్యమేనన్నమాట”

“అరగంటే కదా మాస్టారూ”

“నువ్వు నీ గురించి చెబుతున్నావు సరే. మరి ఆ ఇరవై ఐదు మంది విద్యార్థుల మాటేమిటి?





వారి సమయం విలువైంది కాదని నీ అభిప్రాయమా. నువ్వు మొత్తం పదమూడు గంటలు ఆలస్యం చేశావు."

"మీరు మరీ దారుణంగా మాట్లాడుతున్నారు...." ఇంకా ఏదో అనబోయాను.

అప్పటికి నా ముఖం ఎర్రబడటం నాకే తెలుస్తోంది.

ఉండు అన్నట్టుగా చేత్తో సూచించారు.

"చూడు మూర్తీ. కాస్త స్థిమితంగా ఆలోచించు. ప్రధానమంత్రికైనా పల్లెటూరి బైతుకైనా రోజుకి ఇరవైనాలుగు గంటలే. మరి నీ కోసం ఎదురుచూస్తుండిన విద్యార్థుల విషయమూ అంతేకదా. వాళ్లూ ఇతర పనులు వదులుకుని వచ్చి ఉంటారు కదా."

"క్షమించండి మాస్టారూ ఇకముందు ఇలా జరగదు" అన్నాను తలవంచుకుని.

నా కంఠంలో నిజాయితీని గమనించడానికన్నట్టు నన్నే చూశారు. ఇద్దరి మధ్యా మౌనం. రెండు నిమిషాలు గడిచాయి.

"మరో పది నిమిషాలు ఆలస్యమైతే ఏమయ్యేది" అడిగారు.

చివ్వున తలెత్తి చూశాను.

"మరో పది నిమిషాలు ఆలస్యమైతే ఏమయ్యేది" మళ్లీ రెట్టించి అడిగారు.

దుబ్బు మీసాల వెనుక నుండి వచ్చిన ఆ మాటలు, గంభీరమైన ఆయన చూపులూ నన్ను ఉక్కిరిబిక్కిరిలో పడేశాయి. ఆయన వేళాకోళం చేస్తున్నారో. నిజంగానే అంటున్నారో తెలియలేదు. మళ్లీ ఆయనే అడిగారు.

"ఏ దారిలో వచ్చావు?"

"మీ ఇంటి ముందు నుంచి"

"అక్కడ కిరాణాకొట్టులో సరుకులు కొనడానికెళుతున్న నన్ను నువ్వు చూడలేదు. అది పెద్ద విషయం కాదు. అసలే ఆలస్యమైనదన్న ధ్యాసలో నువ్వున్నావు. కానీ అక్కడ దారిని దాటడానికి ప్రయత్నిస్తుండిన ఒక పాపని నేను పట్టుకోవడంలో ఒక్క క్షణం ఆలస్యం చేసినా నీ స్కూటరు కింద పడేది. జరగరానిది జరిగితే అందుకు బాధ్యత ఎవరిది. ప్రాణం ఎవరిదైనా ఒక్కటే కదా. అందుకే మరీమరీ చెబుతున్నాను. నీవు బద్ధకాన్ని వదిలించుకో. జీవితంలో క్రమశిక్షణ పాటించు. వేరేవాళ్ల కోసం కాదు. నీ అభివృద్ధి కోసం. అప్పుడు అపఘాతాలకు, ఆలస్యానికి అవకాశం ఉండదు. ఎల్లప్పుడూ నువ్వు సమాజంలో ఒకడివే కానీ సమాజానికి అతీతుడివి కాదు గుర్తుంచుకో. మన అలవాట్లే మనల్ని తీర్చిదిద్దుతాయి."

నేను తలవంచుకుని విన్నాను ఆయన చెప్పిన దాంట్లో నాకేమీ తప్పు కనిపించలేదు. కానీ వయసులో ఉన్నాను కదా అవమానమనిపించింది. పది నిమిషాలయ్యుంటుంది.

"ఇక ఇంటికెళ్లి నీ గృహలక్ష్మితో గడుపు" అంటూ తరగతి గది వైపు నడిచారు.

అలవాటైన దారి వెంట నేనిల్లు చేరడమూ, జ్ఞాపకాల నుండి బయటపడటమూ ఒక్కసారే జరిగింది.

ఎదురుగా చిరునవ్వుతో మాస్టారూ, ఆ వెనక నా గృహలక్ష్మి.

○